# నీళ్ళు

యెండ మండిపోతోంది. వేడిగాలి వీస్తోంది. తారురోడ్డు సెగలు కక్కుతోంది. పట్నానికి పదిహేనుమైళ్ళ దూరంలో అందమైన 'ఇంపాలా కారు' ఆగిపోయి ఉంది. దాని యజమానురాలైన కిరణ్మయి కారుని కదిలించాలని విశ్వప్రయత్నంచేస్తోంది. ఎన్నో మైళ్లు యెంతోవేగంగా దూసుకుపోయే కారు అరఅంగుళంకూడా "కదలను" అన్నట్లు మొండికేసింది.

అయిదు లక్షలకి అధికారిణి అయిన కిరణ్మయి డ్రైవరు లేకుండా ఇలా ప్రయాణం యెప్పుడూ చేయదు. కిరణ్మయి భర్త మన్‌మోహన్ అసలు ఇలా ఒంటరిగా వెళ్ళనీయడు.

"నీకెంత బాగా డ్రైవింగ్ వచ్చినా "సిటీ" బైటకిమాత్రంవెళ్లకు. కారు "కాస్త ట్రబుల్" ఇచ్చినా ఇబ్బందిపడిపోతావు." అని మెత్తగానే గట్టిగా మందలిస్తాడు. ఇవాళ ఆయన "టూర్" వెళ్ళటం డ్రైవరు శలవు పెట్టడం సిటీకి ఇరవైమైళ్ళ దూరంలో ఉన్న ఫ్రెండ్స్ విందుకి పిలవటం వల్ల కిరణ్మయి ఒంటరిగా వెళ్లక తప్పలేదు. అయితే యెనిమిదేళ్ల యేకైక పుత్రుడిని వెంట తీసుకుని బయలుదేరింది. కారు కాస్తా గమ్యం చేరకుండానే మధ్యలో ఆగిపోయింది.

బాబు డోర్ తీసుకుని కిందకి దిగాడు.

"మమ్మీ! కారు కదలటంలేదు ఇప్పుడెలా" అందంగావున్న బాబు అమాయకంగా అడిగాడు.

"కదులుతుంది బాబూ! మరేంఫర్లేదు" కొడుక్కి ధైర్యం చెప్తోందే కానీ లోపల భయంగానేవుంది. కారుని పరీక్షిస్తోంది.

"మమ్మీ-వాటర్" యెండవైపు కళ్లు చిట్లించి చూస్తూ ముఖాన పట్టిన చెమటని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ అడిగాడు.

కిరణ్మయి చుట్టూ చూసింది. యెక్కడా నీళ్లు వున్నజాడ కన్పించటంలేదు. రోడ్డుకి ఇటూ, అటూ కొండలు తప్ప మరేంలేవు. ఆ దారివెంట యెవరూ నడవటంలేదు. ఓపావుగంట క్రితంకాబోలు రెండెడ్లబళ్ళు నాలుగు వెళ్ళటం చూసిన గుర్తు వచ్చింది. అసలు కిరణ్మయికి కారులో పోతూ వుంటే నాటుబళ్లు అడ్డం వస్తేచాలు చెడ్డ చికాకు వచ్చేస్తుంది.

మెల్లగా సాగిపోయే ఆ బళ్ళూ వాటిమీద కూర్చున్న నీరకావిబట్టల ఆసాములూ వాళ్ల చేతుల్లో వుండే బారెడు చుట్టలూ చూస్తే తగని అసహ్యం వేస్తుంది కిరణ్మయికి.

"మన ఇండియా ఇంకా ఈ నాటుబళ్లమీదే నడుస్తోంది. ఇదే ఫారిన్ అయితే ఇలాంటి బళ్ళు మ్యూజియమ్‌లోకూడా కన్పించవు. అనుకుని విసుక్కుంటుంది. అసలు వీళ్లు మనుషులేనా! ఏం జీవితాలు వీళ్లవి ఛీ ఛీ! ఇంతకుమించి ఆలోచించటానికే విసుగు.

కిరణ్మయికి అందం ఉంది. ఆస్తి ఉంది. భర్తకి హోదాఉంది. అంతకిమించి అతని ప్రేమ ఉంది. రత్నంలాంటి ఒకే ఒక అబ్బాయి ఉన్నాడు. ముద్దుగా, బొద్దుగా, తెలివిగా ఉంటాడు బాబు. ఆమెకి అయి దంతస్తుల మేడ ఉంది. ఇంపాలా కారు ఉంది. జల్సాగా తిరగటానికి

